క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా పోటీలు



ఆటల పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం షకీల

రాపూరు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాపూరు మండలం సిద్ధవరం ఎంపీపీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం షకీల తెలిపారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, పరుగు పందేలు, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు మంగళవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌస్‌బాషా పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న అధికారి

దొరవారిసత్రం: ఏకొల్లు పంచాయతీ పాళెంపాడులో రూ.10 లక్షలు వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. అలాగే ఏకొల్లులో కూడా త్వరలోనే రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు డీఈ రమణయ్య తెలిపారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి




మొక్క నాటుతున్న ఎస్‌ఐ గోపి

చిల్లకూరు(చిట్టమూరు): మొక్కలు నాటడం కాదు, వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని ఎస్‌ఐ గోపి అన్నారు. మండలంలోని అరవపాళెంలో ఉన్న సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటారని, ఆ సమయంలో గుర్తుగా ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే అది పెరిగిన తరువాత గుర్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొక్కలు నాడడం ఒక ఉద్యమంగా పాటించితే, భావితరాల వారికి మంచి వాతావరణం ఇవ్వడంతో పాటుగా స్వచ్ఛమైన గాలిని అంది వచ్చన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో సుమారు 75 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

చిల్లకూరు: మండలంలోని వడ్డికండ్రిగలో ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు అందడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఉడతావారిపాళెం పంచాయతీ వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన బెల్లంకొండ శీనయ్య అనే వ్యక్తి విద్యుత్ మరమ్మతులు చేసుకునేందుకు అధికారులను అడిగి ఎల్‌సీ తీసుకున్నాడు. అనంతరం ఫీజులు వేసిన తరువాత గ్రామం మొత్తం విద్యుత్ సరఫరా వచ్చినప్పటికీ ఇరగరాజు శీనయ్య ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో అతను ఎల్‌సీ తీసుకున్న వ్యక్తిని అడుగగా సమాధానం చెప్పకపోవడంతోపాటుగా అతనికి మద్దతుగా గ్రామంలోని పుట్టయ్య, వలిపి మనోహర్‌తో కలిసి తనపై దాడి చేసి గాయపరిచినట్లు ఇరగరాజు శీనయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు.. పదిమంది అరెస్టు



జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పెళ్లకూరు:మండలంలోని చెంబడిపాళెంలో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి దాడులు చేసి, పది మంది జూదరులను అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. సెబ్ అధికారుల కథనం మేరకు.. చెంబడిపాళెం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పేకాట జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచారంతో సెబ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.1,550 నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, చంద్రశేఖర్, ఈశ్వరయ్య, భాస్కర్, గురవయ్య, రాజయ్య, మహేంద్ర, హరినాథ్, జయేంద్ర, సుధాకర్, సుబ్రమణ్యం అనే వారిని అరెస్టు చేశారు. నిందితులను పెళ్లకూరు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యమ కెరటం.. స్వేచ్ఛామకుటం..!

అది 1936 సంవత్సరం. దేశవ్యాప్తంగా ఉప్పు సత్యాగ్రహం ఉద్యమస్ఫూర్తి రగులుతోంది. ఉప్పెనలా సాగుతున్న ఉద్యమంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బ్రిటీష్ పాలకుల్లో వణుకు ప్రారంభమైంది. ఉద్యమాన్ని ఎక్కడికక్కడ అణిచివేయాలని భావించి.. ఎందరో నేతల అరెస్టులు..జైళ్లలో బంధించడం..తదితర ఘటనలతో దేశవ్యాప్తంగా ఉద్యమం కదం తొక్కింది. ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న నాయుడుపేట వాసులు ఇక్కడా ఉద్యమానికి సారథ్యం వహించి.. కటకటాలకు వెళ్లారు.

- కదం తొక్కిన దేశభక్తి
- విస్తరించిన నాయుడుపేట ఖ్యాతి
- స్వాతంత్ర్య పోరాటంలో పేటవీరులు



1936లో నాయుడుపేటలో జరిగిన నెహ్రూ సభలో పేట స్వాతంత్ర్య సమరయోధులు(ఫైల్)



రావు వెంకట సుబ్బయ్య(ఫైల్)



వెంకట సుబ్బయ్యకు ఇచ్చిన బంగారు తామర పత్రం

నాయుడుపేటటౌన్: బానిస సంకెళ్ల నుంచి భరత మాతకు విముక్తి కలిగించేందుకు ఎందరో మహనీయులు వీరోచిత పోరాటాలు చేశారు. అలాంటి వారిలో ప్రముఖులు నాయుడుపేట వాసులు నాటి కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట అధ్యక్షుడు మిరియాల గోవిందయ్య, పట్టణానికి చెందిన పీసీసీ సభ్యుడు రావు వెంకటసుబ్బయ్య, దేవత చెంచురామయ్య, శెట్టిపల్లి కోటయ్య, మండిగ వెంకట సుబ్బయ్య, ఫకీరయ్య, తుమ్మూరు ప్రాంతానికి చెందిన పసల వకీలయ్య తదితరులు ఉన్నారు. ముఖ్యంగా మిరియాల గోవిందయ్య, రావు వెంకటసుబ్బయ్య, పసల వకీలయ్య తదితరులు గాంధీ, నెహ్రూల అడుగు జాడల్లో నడిచి ఈ ప్రాంతంలో స్వాతంత్ర్యోద్యమంలో ముందు నడిచారు. అప్పట్లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కూడా నాయుడుపేట వాసులు ప్రధాన భూమికను పోషించారు. బ్రిటిష్ పాలకుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్న దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఉన్న ప్రాంతంలో అప్పట్లో బ్రిటిష్ పాలకుల భవనం ఉండేది. అప్పటి బ్రిటిష్ పాలకుల భవనానికి గోవిందయ్యతో పాటు పసల వకీలయ్య నిప్పు పెట్టి బాంబులు వేసిన ఘటనలో జైలు పాలయ్యారు. బ్రిటీష్‌వారి ఉప్పు సత్యగ్రహన్ని ధిక్కరిస్తూ నాయుడుపేట, సూళ్లూరుపేట, కోటపోలూరు, నాదెండ్లవారి కండ్రిగ, మన్నేముత్తేరి, ఇంకా పలు ప్రాంతాల్లో పనిచేసే కరణాలు వారి తమ పదవులకు రాజీనామాలు చేశారు. దీంతో 1936లో జవహర్‌లాల్ నెహ్రూ నాయుడుపేటకు వచ్చారు. ఆ సమయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా ఉన్న మిరియాల గోవిందయ్య, వెంకటసుబ్బయ్య తదితరుల నాయకత్వం వహించి, పట్టణంలోని పీర్ల చావడిలో నెహ్రూజీ అధ్యక్షతన సమావేశం జరిపి, ఇక్కడి స్వాతంత్ర్య సమరయోధుల్లో స్ఫూర్తి నింపారు. ఆ సమావేశంలో నాయుడుపేటకు వాసులు రూ.116 నగదు విరాళలను సేకరించి, నెహ్రూకు అందజేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్రద్యోమంలో పాల్గొన్న రావు వెంకట సుబ్బయ్యకు 1973లో బంగారు తామర పతాకాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం బహుకరించింది. పట్టణంలో ఆయన నివాసం ఉండిన వీధికి రావువారివీధి అని నామకరణం చేశారు.

> **గాంధీజీని ప్రత్యేక్షంగా చూశాం**
>
> 
>
> స్వాతంత్ర్య సమరయోధులైన మా తండ్రి మిరియాల గోవిందయ్యతో స్వాతంత్ర్య సమర ఘట్టాలను ప్రత్యేక్షంగా వీక్షించాం. అప్పట్లో నాకు 18 ఏళ్లు. గాంధీజీ రైలులో చెన్నైకు వెళుతుండగా నాయుడుపేటలో నిలిచినప్పుడు ఆయన్ని ప్రత్యేక్షంగా చూసి కొంతమంది యువకులతో కలసి రైలులో సూళ్లూరుపేట వరకు వెళ్లాం. నెహ్రూజీ అధ్యక్షతన నాయుడుపేటలో జరిగిన సమావేశంలో పాల్గొన్నాను. అప్పటి స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో పాలు పంచుకున్న ఘటనలు మరుపురానివి. అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉంది.
>
> – మిరియాల వెంకటనారాయణ, నాయుడుపేట

అందరూ సమష్టిగా కృషి చేయాలి



రాపూరు: బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాపూరు సమీపంలోని మద్దెలమడుగు తెలుగుగంగ అతిథి గృహం వద్ద సోమవారం రాపూరు మండల బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరుపతి జిల్లాలో అన్ని నియోజకవర్గాల కన్నా వెంకటగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కోరారు. అలాగే రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. బూత్‌లెవల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తల సహకారంతో ఓటర్లపై దృష్టి పెట్టాలన్నారు. చనిపోయిన, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలన్నారు. అలాగే కొత్త ఓటర్లను అధికంగా చేర్చడంపై దృష్టి సారించాలని కోరారు. వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ఓట్లు చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ జయమ్మ, నాయకులు పీ దయాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శశిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలువాయి: బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

ప్రతి కుటుంబంలో సంక్షేమం

కలువాయి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి అర్హత ఆధారంగా పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి సచివాలయం -3 పరిధిలో కలువాయి, కుమ్మరపల్లె, సీతారామపల్లె గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ఆయా కుటుంబాలకు అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచ్ డి.పెంచలమ్మ, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, నాయకులు ఎం వెంకటనరసారెడ్డి, జీ రమణయ్య, షేక్ జిలానీ, ఓబులేసు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం: నెలబల్లి రెవెన్యూ పరిధిలోని కలగుంట, నెలబల్లి ఎస్టీ కాలనీలకు సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల్లో సోమవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతవారం కలగుంట ఎస్టీ కాలనీకి సమీపంలోని సర్వే నంబర్లు 363, 364లోని మిగులు ప్రభుత్వ భూమి సుమారు 3 ఎకరాలు, నెలబల్లి ఎస్టీ కాలనీ దగ్గర సర్వే నంబర్ 7లోని పశువుల మేతపారం బోకు భూమి సుమారు 4 ఎకరాలు ఆక్రమణలపై సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ భూమి ఆక్రమణ' అనే వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. ఆయన ఆదేశాలు మేరకు ఆక్రమిత భూముల్లో సంబంధిత వీఆర్వో రమేష్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి



వెంకటగిరిరూరల్: 550 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



సైదాపురం: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వెంకటగిరిరూరల్: నేటితరం యువత దేశభక్తిని పెంపొందించుకుని, ఆ దిశగా అడుగులు వేయాలని మార్పు సంస్థ వ్యవస్థాపకుడు పవన్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణం నుంచి పాతబస్టాండ్ వరకు విద్యార్థులతో కలసి 550 అడుగల జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థిదశ నుంచే మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని, ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహారావు, విశ్రాంత అధ్యాపకుడు రమణారెడ్డి, మార్పు సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

సైదాపురం: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేద్దామని ఏఓ పురుషోత్తం శివకుమార్ కోరారు. మండల కేంద్రంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సోమవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాతో పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎం రాధ, హెచ్‌ఎం, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తులను స్మరించుకోవాలి



దక్కిలి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



వెంకటగిరి రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దక్కిలి: దేశ స్వాతంత్రం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవాలని, దేశ ఔనత్యాన్ని, కీర్తిప్రతిష్టలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీడీ వరకుమార్ తెలిపారు. మండలంలోని లింగసముద్రం, వెంబులూరు, డక్కిలి తదితర గ్రామాల్లో అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి – నా దేశం కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా డక్కిలి తహసీల్దార్ కార్యాలయం అవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన అవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. తరువాత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, డక్కిలి సర్పంచ్ ఎస్ వేమక్క, ఎంపీటీసీ సభ్యురాలు ఎం వెంకటరమణమ్మ, ఏపీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, రాజా పాల్గొన్నారు.

పాళెంకోటలో..

వెంకటగిరిరూరల్: మండలంలోని పాళెంకోటలో సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని, మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆయన హయాంలో అభివృద్ధి శూన్యం

తిరుపతి సిటీ:పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న కురుగొండ రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గానికి చేసింది శూన్యం అని సహకార సంఘం మాజీ అధ్యక్షురాలు దేవికా చౌదరి విమర్శించారు. సోమవారం వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లెలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు దిక్సూచిగా ఉండాల్సిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ప్రజలను రెచ్చగొట్టి సీఎం దిష్టిబొమ్మను తగలబెట్టడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అవమానకరంగా దూషించడం దారుణమన్నారు. మండల మాజీ ఉపాధ్యక్షులు, రమేష్ చౌదరి, మాజీ సర్పంచ్ చెంచుక్రిష్ణయ్య, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మోటార్ బైక్‌ను ఢీకొన్న కారు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. సీతారామాపురం మండలం మారంరెడ్డిపల్లెకు చెందిన ఏ అశోక్‌కుమార్ ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య మేరి పెళ్లకూరు మండలం పునబాక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. భార్యాభర్తలు నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి బైక్‌పై బజారు నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో వీరి బైక్‌ను బైపాస్ రోడ్డు వద్ద కారు ఢీకొంది. గాయపడిన భార్యాభర్తలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రథమచికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి స్థలం విషయమై అన్నపై దాడి చేసిన తమ్ముడు

ఇంటి స్థలం విషయమై గొడవ పడి సొంత అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపరచి నట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన దార్ల ఏడుకొండలు అతని తమ్ముడు విజయకుమార్‌కు ఇంటి స్థలం విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 6 తేదీన విజయకుమార్ అన్న ఏడుకొండలుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గ్రామ పెద్దలు రాజీ చర్చలు జరిపిన తనకు న్యాయం జరగలేదని బాధితుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాళెంకోట సర్పంచ్ ఏకగ్రీవం



వెంకటగిరిరూరల్: ధ్రువపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి జగదీష్‌బాబు



పెంచలయ్యకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి భవానీ

వెంకటగిరిరూరల్: మండలంలోని పాళెంకోట పంచాయతీ ఉప ఎన్నికల్లో పాళెంకోట సర్పంచ్‌గా యాకసిరి వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవయ్యారు. ఎన్నికల్లో భాగంగా ఈ నెల 10వ తేదీన యాకసిరి వేణుగోపాలరెడ్డి, యాకసిరి మౌనిక, గుండబోయిన సుగుణమ్మ, గుగ్గిళ్ల నాగరాజు నామినేషన్‌లు దాఖలు చేయగా సోమవారం ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీష్ బాబు యాకసిరి వేణుగోపాల్‌రెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవమైనట్లు నియామకప్రతం అందజేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

6వ వార్డు ఏకగ్రీవం

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కేసీఎస్ గుంట పంచాయతీ ఆరో వార్డు సభ్యురాలిగా పొన్నా ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తడ మండల ఎంఈఓ, ఎన్నికల అధికారి మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గతంలో ఉన్న ఝాన్సీ వార్డు సభ్యురాలికి ఉద్యోగం రావడంతో ఆమె తన పదవికి రాజీనామా చేసింది. దీంతో ఈ వార్డుకు ఎన్నికలు నిర్వహణకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పొన్నా ప్రసన్న అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎవరు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు అధికారులు వార్డు సభ్యురాలిగా ధ్రువీకరణ పత్రం అందజేశారు.

చేడిమాల రెండో వార్డు ఏకగ్రీవం

చిల్లకూరు: మండలంలోని చేడిమాల పంచాయతీలో రెండో వార్డు సభ్యుడు మృతి చెందడంతో వార్డు ఏకగ్రీవం అయినట్లు రిటర్నింగ్ అధికారి గూడూరు భవానీ సోమవారం ప్రకటించారు. ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడంతో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పరిశీలనలో కూడా ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. కాగా సోమవారం ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన పొల్లూరు పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఆయనకు ధ్రువపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాణిక్యం, చేడిమాల పంచాయతీ కార్యదర్శి రమణయ్య, తిప్పగుంటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్ పిచ్చయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

3 వార్డులు ఏకగ్రీవం

సైదాపురం: మండలంలోని గిద్దలూరు, మలిచేడు, తుమ్మలతలుపూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డులకు ముగ్గురు అభ్యర్థులు మాత్రమే ఉండడంతో మూడు వార్డులు ఏకగ్రీవమైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. తుమ్మలతలుపూరుకు చల్లా వెంకటేశ్వర్లు, గిద్దలూరుకు కె విజయభాస్కర్‌రెడ్డి, మలిచేడుకు మందా పెంచలయ్య ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. ఏకగ్రీవమైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

వార్డు సభ్యురాలిగా రమణమ్మ ఏకగ్రీవం

నాయుడుపేట: మండలంలోని గొట్టిప్రోలు పంచాయతీ మూడో వార్డు సభ్యురాలిగా తాడిపత్రి రమణమ్మ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సుమన్ సోమవారం ప్రకటించారు. గతంలో 3వ వార్డు సభ్యుడిగా ఉన్న తాటిపర్తి పండయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో ఆ స్థానానికి ఉపఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో పండయ్య భార్య రమణయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఈ వార్డుకు ఒకే నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

వార్డు సభ్యుల ఎన్నికల బరిలో ఆరుగురు

రాపూరు: మండలంలో బొజ్జనపల్లె, గిలకపాడు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వార్డుకు ఆరుగురు పోటీలో ఉన్నట్లు ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. సోమవారం నామినేషన్లు ఉపసంహరణ ముగియడంతో బొజ్జనపల్లెలోని ఎనిమిదో వార్డు (ఎస్సీ మహిళ) కు ముగ్గురు మహిళలు నెమళ్ల రమణమ్మ, పోట్లూరు బుజ్జమ్మ, మొలకల నాగమణి పోటీలో ఉన్నట్లు చెప్పారు. అలాగే గిలకపాడులో మూడో వార్డుకు (ఓసీ జనరల్)లో చల్లారాజగోపాల్, తిరుమల కొండ అంకయ్య, పచ్చా నరేష్ పోటీలో ఉన్నట్లు చెప్పారు. గోనుపల్లెలో గిలకా ఆదెమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. బొజ్జనపల్లె, గిలకపాడులో ఈనెల 19వ తేదీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తులు కేటాయింపు

వాకాడు: మండలంలో కొండాపురం పంచాయతీ ఏడో వార్డుకు ఈ నెల 19వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులకు సోమవారం గుర్తులు కేటాయించినట్లు ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఏడో వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో అభ్యర్థి మల్లి గిరిజకు ప్రెషర్ కుక్కర్, టీడీపీ మద్దతుదారు చెమిర్తి సంధ్యకు గౌను గుర్తును ఎలక్షన్ కమిషనర్ కేటాయించారన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం



గూడూరురూరల్: సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాట్లు



సైదాపురం: రెవెన్యూ కార్యాలయంలో రంగు కాగితాలు అతికిస్తున్న సిబ్బంది

గూడూరురూరల్: సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజాప్రతినిధులదరికీ ఆహ్వానాలు పంపామని గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. స్వాతంత్ర్య దిన వేడుకల కోసం సభా ప్రాంగణం, పార్కింగ్, విజిటర్స్ గ్యాలరీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రగతి నివేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పలు శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. ముందు జాగ్రత్తగా హెల్త్ సెంటర్, అగ్నిమాపక యంత్రం అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ప్రభుత్వ కార్యాలయాల ముస్తాబు

సైదాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను ముస్తాబు చేస్తున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను విద్యార్థులు అందంగా ముస్తాబు చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా ముస్తాబు చేస్తున్నారు.

పాఠశాలలు ముస్తాబు

పెళ్లకూరు: స్వాతంత్ర్య వేడుకలకు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు ముస్తాబయ్యాయి. పెళ్లకూరు, చిల్లకూరు, తాళ్వాయిపాడు, నెలబల్లి, చెంబేడు తదితర ప్రభుత్వ పాఠశాలల్లో రంగు కాగితాలు అతికించి, తరగతి గదుల్లోనూ, పాఠశాల ఆవరణలోనూ రంగువల్లులు తీర్చిదిద్దారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, వాలీబాల్ తదితర ఆటలపోటీలు నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు.

ముస్తాబవుతున్న ప్రభుత్వ కార్యాలయాలు

వెంకటగిరిరూరల్: స్వాతంత్ర్య దిన వేడుకలకు వెంకటగిరిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. వెంకటగిరి మున్సిపాలిటీ, మండల పరిషత్‌కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, మండలంలోని 9వ బెటాలియన్‌తోపాటు పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఉన్న అన్నీ సచివాలయాలు, పాఠశాలలు స్వాతంత్ర్యదిన వేడుకలకు ముస్తాబయ్యాయి.



పెళ్లకూరు: ఆటలపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో...

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ శిక్షణ



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ లో ఎన్‌సీసీ 10 ఆంధ్ర నేవల్ యూనిట్ శిక్షణ శిబిరం గత రెండు రోజులుగా జ రుగుతోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 600 మంది వరకు కళాశాల వి ద్యార్థులు ఈ శిక్షణ లో పాల్గొంటున్నారు. సోమవారం లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఫైరింగ్‌తోపాటు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చా రు. ఈ సందర్భంగా వినయ్‌రామచంద్రన్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో పోరాట పటిమ, క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందన్నారు. తగు జాగ్రత్తలతో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ మాధవయ్య, నరేంద్రబాబు, ప్రసాద్, రామన్ పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులదే కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

గూడూరురూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో సోమవారం జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి జగనన్న బీమా నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు కీలక బాధ్యతలు వహించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో గూడూరు ఎంపీపీ బీ గురవయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీ విజయకుమార్, కే మీరారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసు లు, జేసీఎస్ కన్వీనర్లు రాఘవరెడ్డి, శ్రీహరి, గూడూరు వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, దిలీప్‌రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో గూడూరు అభివృద్ధి

గూడూరు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జరిగిందని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్, సంయుక్తనగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సీసీరోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సతీష్‌రెడ్డి, మురళి, నరసప్ప పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో ట్రాఫిక్ సమస్యపై సీఐలతో సమావేశం నిర్వహించారు.

ప్రశ్నించేతత్వంతోనే విజ్ఞానం



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు

గూడూరురూరల్: ప్రశ్నించేతత్వంనే జ్ఞానం అభివృద్ధి చెంది, సమాజం ముందుకెళుతుందని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు అన్నారు. సోమవారం గూడూరు సమీపంలోని ఆదిశంకర కళాశాలలో జరిగిన ఆదిశంకర సిరీస్ లెక్చర్స్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువే కాకుండా సమాజంలోని అన్ని రంగాలపై అవగాహన కల్పించేందుకు వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో ప్రశ్నించే తత్వం ప్రముఖ ఫిలాసఫర్ అరవింద్ ఘోష్‌తో మొదలైందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఫిలాసఫర్, కవి, ఆధ్యాత్మికవేత్త అయిన అరబిందో ఘోష్ భావజాలం వచ్చాక సమాజంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ప్రజలు పాత పద్ధతుల్లో తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. తద్వారా గుండె జబ్బులు నివారించవచ్చని తెలిపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక కళాశాలలో ఆధ్యాత్మికత ఉండడం మంచిదేనన్నారు. ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, మంచి భావాలు పెంపొందుతాయని తెలిపారు. కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థుల మేథో మథనం కోసం మేధావుల ఉపన్యాసాలు పేరిట స్వాతంత్ర్య దినోత్సవం, అరబిందో ఘోష్ జన్మదినం సందర్భంగా అద్భుతమైన కార్యక్రమానికి నాంది పలికామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎ.మోహన్, ఏఓ రామయ్య, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు



నేదురుమల్లి

వెంకటగిరిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు, అధికారులకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నాటి త్యాగమూర్తుల ఫల మే నేటి స్వాతంత్ర్యమని, ఈ మేరకు ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): హత్యకేసులో దుగ్గబోయిన సాయిశివకుమార్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ ఐదో అదనపు ఇన్‌చార్జి జిల్లా జడ్జి తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో రెండో నిందితుడు రఘుఅరవింద్‌పై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారు. వివరాల్లోకి వెళితే.. గూడూరు మండలం దివిపాళెం పంచాయతీ చవటపాళేనికి చెందిన నిందితుడు సాయిశివకుమార్, హతుడు విశ్రాంత రైల్వే ఉద్యోగి తిరుమలశెట్టి జయరామయ్య స్నేహంగా ఉండేవారు. నిత్యం వారు గ్రామ సమీపంలోని మద్యం దుకాణంలో మద్యం తాగేవారు. ఈ నేపథ్యంలో సాయిశివకుమార్ నగదు అవసరమై జయరామయ్యను అడగ్గా తిరస్కరించడమే కాకుండా నానా దుర్భాషలాడాడు. దీంతో జయరామయ్యపై నిందితుడు కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2018 నవంబర్ 14న రాత్రి 10.30 గంటల సమయంలో సాయిశివకుమార్ మద్యం దుకాణం వద్ద మద్యం సేవించి ప్రతిఒక్కరిని డబ్బులు ఇవ్వాలని వేధించసాగాడు. అదే సమయంలో దుకాణం వద్దకు వచ్చిన జయరామయ్యను నగదు ఇవ్వమని కోరగా తిరస్కరించాడు. దీంతో ఆగ్రహించిన సాయిశివకుమార్, మరో నిందితుడు రఘుఅరవింద్‌తో కలిసి జయరామయ్యను బలవంతంగా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫ్లెఓవర్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం సాయిశివకుమార్ తన దగ్గర ఉన్న కత్తితో ఇష్టానుసారంగా జయరామయ్యను పొడిచి హతమార్చి పరారయ్యాడు. మరుసటిరోజు ఉదయం జయరామయ్య మృతదేహాన్ని గుర్తించిన కుమారుడు తిరుమలశెట్టి రమేష్ గూడూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితులు సాయిశివకుమార్, రఘుఅరవింద్‌పై కేసు నమోదు చేశారు. విచారణానంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడు సాయిశివకుమార్ కు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసును అప్పటి గూడూరు పట్టణ డీఎస్పీ వీ రాంబాబు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ జగదీష్ వాదించారు.

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలతో...

బ్లడ్ గ్రూపింగ్ సీరం కిట్ల అందజేత



కిట్లను అందజేస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

గూడూరురూరల్: బ్లడ్ గ్రూపింగ్ సీరం కిట్లను సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుడు శివాని స్టడీ సర్కిల్ అధినేత ఎం.శివకుమార్‌రెడ్డి దాతృత్వంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కోశాధికారి కే శ్రీనివాసులు, డాక్టర్ ప్రసూన, హెడ్‌నర్స్ విజయ, షేక్ మౌలాలి, వినోద్, సంస్థ సభ్యులు కే శ్రీనివాసులు, రాము, కుమార్ నాయుడు, శ్రీహరి, నాగరాజు, కృష్ణారెడ్డి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అండదండలే సీఎం జగనన్నకు శ్రీరామరక్ష



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజల అండదండలే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలో ఉన్న కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం సూళ్లూరుపేట నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన జేసీఎస్ కన్వీనర్ల బీమా సమోదు కార్యక్రమం నిర్వహించి, సభ ఏర్పాటు చేశారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళ సాధికారతకు రూ.కోట్ల నిధులు వెచ్చించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అలజడులు సృష్టిస్తూ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడమే ధ్యేయంగా కుట్రలు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, జెసీఎస్ నాయుడుపేట మండల కన్వీనర్ ఓ కిషోర్‌యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డీ బాలచంద్రారెడ్డి, నియోజవర్గ పార్టీ పరిశీలకులు ఎం సుధీర్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ తిరుపతి జిల్లా కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, అనిల్‌రెడ్డి, ఎం సుధాకర్, శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా లెక్కచేయకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఏపీఎంలు, సీసీలు, ఏరియా కోఆర్డినేటర్లకు ప్రభుత్వం 23 శాతం పీఆర్సీ అమలు చేయడంతో ఆ శాఖ ఉద్యోగులు సోమవారం నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఉద్యోగులు, నాయకులకు పంచి పెట్టారు. అనంతరం ఎమ్మెల్యే సారథ్యంలో ఉద్యోగులు, నాయకులు కలసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏరియా కోఆర్డినేటర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా పల్లకీ సేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి పల్లకీ సేవ సోమవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పురువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు బియ్యం బస్తాలు



బియ్యం బస్తాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

దొరవారిసత్రం: నెలబల్లి పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన పేద కుటుంబాలకు తడకంద్రిగకు చెందిన శ్రీకృష్ణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం బస్తాలు అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సాన శ్రీనివాసులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ నిర్వాహకులు నాగరాజు తెలిపారు.

ముక్కంటి సేవలో నటుడు జోగినాయుడు



ధ్వజస్తంభం వద్ద జోగినాయుడు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం సినీనటుడు, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

మాతా పరమేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



ఒగ్గుకథను భక్తులకు వినిపిస్తున్న కళాకారులు

చిల్లకూరు: మండలంలోని చేడిమాల అరుంధతీయవాడలో ఉన్న మాతా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి తొలి రోజున పుట్ట బంగారం తీసుకువచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగవల్లులతో పోతురాజు బొమ్మను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఒగ్గు కథను భక్తులకు కళాకారులు వినిపించారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం తపస్సుమాను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి కుటుంబలోని బంధుమిత్రలు గ్రామానికి రావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

21లోపు ఓటర్ల సర్వే పూర్తి చేయాలి



బూదూరులో సర్వేని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి

దొరవారిసత్రం: మండలంలో ఈ నెల 21వ తేదీలోపు ఓటర్ల ఇంటింటి సర్వేని పూర్తి చేయాలని తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి సూచించారు. బూదూరు పరిధిలోని పోలింగ్‌స్టేషన్ 180లో ఓటర్లు జాబితా తీరును సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టి, నివేదికలు ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీ స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్: తన వార్డు పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని 14వ వార్డు కౌన్సిలర్ అరిశంకరయ్య తెలిపారు. ఆ వార్డు పరిధిలోని సచివాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని సమస్యలను వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గాంధీపార్కు ఆధునికీకరణ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గాంధీపార్కులో ప్రజలకు ఆహ్లాదం కలిగేలా ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు కమిషనర్ ఐ శ్రీనివాసరావు వెల్లడించారు. పార్కులో జరుగుతున్న పనులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అందరికీ కనువిందు చేసేలా వివిధ రకాల బొమ్మలు, జంతువుల ఆకృతుల్లో మొక్కల పెంపకం, జాతీయ నాయకులు చిత్రపటాలు, వివిధ రకాల క్రీడా పరికరాలను పార్కులో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.